క్లుప్తంగా

'ఆయుష్మాన్ భవ'పై ఆశా వర్కర్లకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న వైద్యాధికారులు

నెన్నెల: స్థానిక రైతువేదికలో శనివారం ఆయుష్మాన్ భవ కార్యక్రమంపై ఆశా కార్యకర్తలకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చినట్లు మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యం కోసం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ నెల 17నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఆయుష్మాన్ భవ పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భీమిని ప్రభుత్వ వైద్యాధికారి కృష్ణ, తాండూర్ పీహెచ్ఎస్ పద్మ, ఆశ నోడల్ ఇందిరా, ఏఎస్ఎం మల్లేశ్వరి, భీమిని సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



భోజనం రుచిచూస్తున్న న్యాయమూర్తి

బెల్లంపల్లి: విద్యార్థులకు శుచి, శుభ్రతతో కూడిన నాణ్యమైన భోజనం వడ్డించాలని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ముఖేష్ అన్నారు. బెల్లంపల్లిలోని ప్రభుత్వ మైనార్టీ బాలికల గురుకుల కళాశాల, మహాత్మా జ్యోతిభా పూలే బాలికల గురుకుల పాఠశాలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఆయా గురుకులాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు ప్రత్యక్షంగా పరిశీలించారు. జ్యోతి భాపూలే బాలికల గురుకులంలో భోజనం నాణ్యతగా లేకపోవడంతో సిబ్బందిని మందలించారు. ఖచ్చితంగా నాణ్యత పాటించాలని, మెనూను అనుసరించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాసిపేట: మండలంలోని కొండాపూర్ 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో ఆదివారం అత్యవసర మరమ్మతులు చేస్తున్నందునా మండలంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

నెన్నెల: మండలం కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ మల్లయ్య తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

'విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తాం'



బైక్ ర్యాలీలో పాల్గొన్న రఘునాథ్

నస్పూర్: తాము అధికారంలోకి వచ్చాక తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ తెలిపారు. బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం శ్రీరాంపూర్ బస్టాండ్, సీసీసీ కార్నర్, మంచిర్యాలలోని ఐబీ చౌరస్తా, ముఖరం చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా మీదుగా అమరవీరుల స్థూపం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. శ్రీరాంపూర్‌లోని సింగరేణి కార్మికుడి విగ్రహానికి, అమరవీరుల స్థూపం వద్ద అమరులకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రజినీష్‌జైన్, తిరుపతి, మల్లేశ్, సత్రం రమేశ్, రాజు, బోయిని దేవందర్, కుర్రె చక్రి, అశోక్, సిరికొండరాజు, తదితరులు పాల్గొన్నారు.

భీమిని మండల సమావేశం

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు తమ నివేదికలు చదివి వినిపిస్తుండగా తెలంగాణ క్రీడా ప్రాంగణాలు నిర్మించి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ బిల్లులు రావడం లేదంటూ సభ్యులు ఏపీఓ శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వ్యవసాయాధికారి శ్రీకాంత్ నివేదికను చదువుతుండగా సబ్సిడీ ఎరువులు రైతులకు సరిగ్గా అందడం లేదని, బయటి వ్యక్తులకు అధిక ధరలకు అమ్ముతున్నారని ఎరువులు అందేలా చూడాలని వీరాపూర్ సర్పంచ్ అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. కేజీబీవీ పాఠశాల కంపౌండ్‌వాల్ లేకపోవడంతో పశువులు సంచరిస్తున్నాయని పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని కేజీబీవీ ప్రత్యేక అధికారిణి వినిత కోరారు.

పడిపోయినా పట్టించుకోరా..?



జన్నారం మండలంలోని కలమడుగు గ్రామంలో పది రోజుల క్రితం అతివేగంగా వచ్చిన లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టగా విద్యుత్‌స్తంభం విరిగిపోయింది. ఆ స్తంభానికి మినీ ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉంది. ఆ సమయంలో విద్యుత్ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటన జరిగి 10రోజులు గడిచినా విద్యుత్ అధికారులు మినీ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభం వైపు కన్నెత్తి చూడకపోవడంపై గ్రామస్తుల నుంచి విమర్శలు వస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించాలని ఎంపీటీసీ స్వరూపరాణి, ఆలయకమిటీ అధ్యక్షుడు స్వదేశ్‌కుమార్, గ్రామస్తులు బాలరాజ్, బుచ్చన్న డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్ స్తంభం పడిన చోట మరో స్తంభం ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరించాలని కోరుతున్నారు. - జన్నారం

నత్తనడకన పనులు.. !

జిల్లా కేంద్రంలోని రామునిచెరువు అభివృద్ధి పనులు రెండేళ్లుగా నత్తనడకన కొనసాగుతున్నాయి. చెరువుకట్టపై కొన్ని ఏళ్లుగా వాకింగ్ చేస్తున్న వారికి ఈ పనులు అడ్డంకిగా మారుతున్నాయి. వాకింగ్ ట్రాక్‌పై మట్టి పోయడం వల్ల, చిన్నపాటి వర్షానికే బురదగా మారి, వాకింగ్ చేసేందుకు వీలు లేకుండా పోతోంది. చెరువు అభివృద్ధి పనుల పేరిట ఏళ్ల తరబడి పనులు చేపట్టడం వల్లనే ఈ ఇబ్బందులు ఉంటున్నాయని, వీటిని త్వరగా పూర్తి చేసి, వాకర్ సభ్యులకు ఇబ్బంది లేకుండా చేయాలని పలువురు కోరుతున్నారు. - మంచిర్యాలటౌన్



అసంపూర్తిగా కొత్తపల్లి జీపీ భవనం





భీమారం మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు సంవత్సరాలు కావస్తున్నా పూర్తికాకపోవడంతో పశువులకు షెల్టర్‌గా మారిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామపంచాయతీ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ ఇప్పటివరకు దానిని పూర్తి చేయలేదు. దీంతో అది పశువులకు నిలయంగా మారిందని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా జీపీ భవనం నిర్మాణ పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. - భీమారం

ఇంకా పూర్తి కాని కొత్తపల్లి జీపీ భవనం దుస్థితి

మట్టి వినాయకులనే ప్రతిష్టించాలి

- ప్రాముఖ్యతపై అవగాహన

మంచిర్యాలఅర్బన్: వినాయక చవితి పర్వదినం రోజున బంకమట్టితో చేసిన వినాయకులను పూజించాలని, వినాయకుల తయారీపై గ్రీన్‌కోర్ జిల్లా కో-ఆర్డినేటర్ యోగేశ్వర్ అవగాహన కల్పించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం పర్యావరణ క్లబ్ ఆధ్వర్యంలో బంకమట్టి వినాయకుల తయారీపై వివరించారు.

మంచిర్యాలఅర్బన్: పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పర్యావరణ గణపతి- ఓజోన్ డే ఘనంగా నిర్వహించారు. పర్యావణ గణపతి, ఓజోన్‌కు సంబంధించిన చిత్రాలతో ఫ్లకార్డులు చేతబూని విద్యార్థులు ప్రదర్శించారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు మట్టితో వినాయక విగ్రహాల తయారీ, వాటి ప్రత్యేకత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి సర్వర్ పాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోటపల్లి: బమన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం బుచ్చన్న ఆధ్వర్యంలో మట్టిపాత్రల తయారీదారుడు కుమ్మరి శంకర్‌తో మట్టితో గణపతులు తయారీ, వాటి ప్రాముఖ్యతపై విద్యార్థులకు వివరించారు.

నెన్నెల: మండలంలోని మైలారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు వారు తయారు చేసిన మట్టి గణపతులతో ప్రధానోపాధ్యాయులు లింగయ్య ఆధ్వర్యంలో గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మట్టి గణపతులను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.



శివపార్వతులు, గణపతి వేషధారణలో చిన్నారులు

శ్రీ చైతన్య పాఠశాలలో చవితి సంబురాలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం ముందస్తుగా వినాయక చవితి సంబురాలు నిర్వహించారు. శివపార్వతులు, వినాయక వేషధారణాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. చిన్నారుల సంస్కృతిక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. పాఠశాల జోబిన్, ఏవో విలాస్, పీఈటీ రాజేందర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చెన్నూర్‌రూరల్: విగ్రహాలతో విద్యార్థులు, అధ్యాపకులు



నెన్నెల: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



మంచిర్యాలఅర్బన్: ఫ్లకార్డుల ప్రదర్శన

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

దండేపల్లి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని, ఇందుకు గాను కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తుందని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. మండలంలోని మొకాశిగూడ వద్ద వాగుపై నూతనంగా నిర్మించిన వంతెనను, అల్లీపూర్, గుడిరేవు, మాకులపేట, పాతమామిడిపల్లి, కొత్తమామిడిపల్లి, దండేపల్లి, నెల్కివెంకటాపూర్, చెల్కగూడ, రెబ్బనపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు గ్రామగ్రామాన సీసీ రోడ్లు, వాగులు దాటేందుకు వంతెనల నిర్మాణాలు, డ్రెయినేజీలు, తదితర అభివృద్ధి పనులు చేస్తున్నామని గుర్తు చేశారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ అనిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పీఆర్ డీఈ ప్రకాశ్, ఏఈఈలు తివారీ, విక్రమ్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వంతెన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లిరూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బెల్లంపల్లి మండలం దుగ్నెపల్లి గ్రామంలో రూ.12లక్షల నిధులతో నిర్మించే నూతన సీసీ రోడ్డు, సైడ్ డ్రెయినేజ్, పెర్కపల్లి గ్రామంలో రూ.30లక్షల నిధులతో నూతన సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీ, రూ.18లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే చిన్నయ్య భూమిపూజ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి పనులు చేపట్టడంతో గ్రామాలు అభివృద్ధి పథంలోకి వచ్చి గ్రామీణులకు మెరుగైన వసతులు సమకూరాయని సూచించారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

పలువురు సమస్యలను విన్నవించగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్‌లు సురేష్, పద్మావతి, ఎంపీడీవో రాజేందర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గణేష్ గౌడ్, నాయకులు అశోక్ గౌడ్, రాజశేఖర్, రవి, లక్ష్మణ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్

- జైపూర్ ఏసీపీ మోహన్

కోటపల్లి: నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం చేపడుతున్నట్లు ఏసీపీ మోహన్ అన్నారు. బొప్పారం గ్రామంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామంలో తనిఖీలు నిర్వహించి 25వాహనాలు సీజ్ చేసినట్లు ఏసీపీ మోహన్ వివరించారు.నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామంలో ప్రస్తుత పరిస్థితులను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఐ విద్యాసాగర్, ఎస్సైలు సురేశ్, సుబ్బారావు, రాజ్యవర్ధన్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు ఆనందంగా జరుపుకోవాలి

చెన్నూర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను స్నేహపూర్వక వాతావరణంలో ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని జైపూర్ ఏసీపీ మోహన్ అన్నారు. స్థానిక సాయిరాం ఫంక్షన్‌హాల్లో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండళ్ల నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గణేశ్ మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీజేలు వినియోగించొద్దని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, చెన్నూర్ సీఐ వాసుదేవరావు, రూరల్ సీఐ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నూర్: మాట్లాడుతున్న ఏసీపీ మోహన్

రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

తాండూర్/బెల్లంపల్లిరూరల్/పాతమంచిర్యాల: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ వేడుకలను శనివారం జిల్లా కేంద్రం, తాండూర్, బెల్లంపల్లిలోని పలు గ్రామాల్లో సీపీఐ ఆధ్వర్యంలో 75వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించి ఎర్రజెండా ఎగురవేశారు. సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరులకు కామ్రేడ్స్ జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, ఖలీందర్ అలీఖాన్, దేవి పోచన్న, చాడ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

అంగన్ వాడీల సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి/భీమిని/కాసిపేట: రాష్ట్ర ప్రభుత్వం అంగన్ వాడీ టీచర్ల సమస్యలు తీర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి, కన్నెపల్లి, కాసిపేటలో శనివారం అంగన్‌వాడీల దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేశవరెడ్డి, గోవర్ధన్, శ్రీనివాస్, రామయ్య, నవీన్, నర్సింగ్, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు. కాసిపేటలో అంగన్‌వాడీలకు వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజీమొద్దీన్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కవిరాజు మద్దతు ప్రకటించారు.

తాళాలు పగుల గొట్టడంతో సమ్మె ఆగదు

సమ్మె చేస్తున్న క్రమంలో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టే చర్యలకు పాల్పడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.రవి విమర్శించారు. సమ్మె శిబిరాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ నియంతృత్వ పోకడలకు పోతున్నారని, అంగన్ వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టడం వల్ల సమ్మె ఆగబోదన్నారు.

నెన్నెల: అంగన్‌వాడీల సమ్మెకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెన్నోజు శంకరయ్య మద్దతు తెలిపి సమ్మెలో పాల్గొన్నారు. బతుకమ్మ ఆడి కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. సమ్మెలో పాల్గొన్న 90ఏళ్ల బామ్మ జోగాపూర్ ఆయమ్మ పర్శా రాజమ్మ అలిసిపోయి నీరసించి పడుకొని విశ్రాంతి తీసుకుంది.

జన్నారం: డిమాండ్లు నెరవేర్చాలని చేపట్టిన అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్ల సమ్మె కొనసాగుతోంది. ఎన్ఎస్‌యూఐ నాయకులు శనివారం సమ్మెలో పాల్గొని మద్దతు తెలిపారు. సమ్మెకు ఎన్ఎస్‌యూఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహెల్, అంగన్‌వాడీ టీచర్లు సరస్వతి, విజయలక్ష్మి, ఎన్ఎస్‌యూఐ నాయకులు అజార్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఏమాజీ, అంగన్‌వాడీ టీచర్లు

ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి

నస్పూర్: ప్రతీ సంవత్సరం లాగానే ఈ సంవత్సరం నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని కార్పొరేట్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జనరల్ మేనేజర్, కార్పొరేట్ టార్గెట్ కమిటీ కన్వీనర్ జక్కం రమేశ్ తెలిపారు. సీసీసీ సింగరేణి గెస్ట్‌హౌస్‌లో శనివారం 2024-25ఆర్థిక సంవత్సరానికి శ్రీరాంపూర్ ఏరియా గనుల ఉత్పత్తి లక్ష్యాలపై టార్గెట్ కమిటీ సమావేశం అయ్యింది. శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనులు సాధించాల్సిన బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు లక్ష్యాలను కార్పొరేట్ కమిటీ నిర్ణయిస్తుందని తెలిపారు. సమావేశంలో సర్వే జీఎం రవి, ఎస్ఓటు జీఎం రఘుకుమార్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉపరితల గనుల అధికారులు శ్రీనివాస్, పురుషోత్తం రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జక్కం రమేశ్

'దళితబంధు' పథకాలపై ఆరా

జైపూర్: మండల వ్యాప్తంగా దళితబంధు పథకం ద్వారా ఆయా వృత్తులు, బిజినెస్‌లు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్న వ్యక్తులు, వారికి వస్తున్న ఆధాయంపై ఎస్సీ కార్పొరేషన్ అధికారులు ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇందారం, ముదిగుంట, షెట్‌పల్లి, బెజ్జాల, కుందారం గ్రామంతో పాటు ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన ఎస్సీ కార్పొరేషన్ జీఎం ఆనంద్‌కుమార్, ఈడీ దుర్గప్రసాద్ లబ్ధిదారుల నుంచి వివరాలను స్వీకరించారు.



టెంట్‌హౌజ్‌ను పరిశీలిస్తున్న కార్పొరేషన్ జీఎం ఆనంద్‌కుమార్, ఈడీ దుర్గప్రసాద్

రెస్క్యూ స్టేషన్‌లో జెడ్ఎంఆర్‌సీ కాంపిటీషన్

మందమర్రిరూరల్: ఏరియాలోని రామకృష్ణాపూర్‌లో గల రెస్క్యూ స్టేషన్‌లో శుక్ర, శనివారం జెడ్ఎంఆర్సీ సెలెక్షన్ కాంపిటీషన్స్ జరిగాయి. మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలు ఒక టీం కాగా, శ్రీరాంపూర్ టీంలు ఈ కాంపిటీషన్స్‌లో పాల్గొన్నాయి. పోటీల్లో ఆక్టివ్ రెస్క్యూ ట్రెండ్ పర్సన్స్ పాల్గొన్నారు. ఎంపికైన టీంలను త్వరలోనే ప్రకటించనున్నట్లు సింగరేణి వ్యాప్త సెలెక్షన్ వచ్చే నెలలో ఉంటాయని ఎలెక్షన్ నిర్వాహకులు తెలిపారు. శ్రీరాంపూర్ ఏఎస్వో శ్రీధర్, మందమర్రి ఏఎస్వో రవీందర్, రెస్క్యూ స్టేషన్ ఇన్‌చార్జి రామ్మోహన్, డాక్టర్ నాగేశ్వరరావు,బ్రిగేట్స్ సంపత్, మనోహర్, సదాశివ, సత్యనారాయణ, వెంకటేష్, శ్రీరామ్, మహేష్, శ్రావణ్ ఉన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

మెరుగైన సేవలందించాలి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కళ్యాణిఖని-1 డిస్పెన్సరీని ఏరియా జీఎం మనోహర్ శనివారం సందర్శించారు. డిస్పెన్సరీ సిబ్బందిని వసతులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీఎం మాట్లాడుతూ ఉద్యోగులకు వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ఆయన వెంట పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, తదితరులు ఉన్నారు.

మట్టి గణపతుల పంపిణీ

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో ఉన్న సెంట్రల్ నర్సరీలో జీఎం సంజీవరెడ్డి, నస్పూర్ కాలనీలోని సేవాభవన్‌లో సేవా అధ్యక్షురాలు రాధాకుమారీ వేరువేరుగా భక్తులకు వినాయక మట్టి విత్తన విగ్రహాలను అందజేశారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో శనివారం సింగరేణి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా జీఎం హాజరై పంపిణీ చేశారు.

ఏరియా వర్క్‌షాప్ సందర్శన

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని వర్క్‌షాప్‌ను డైరెక్టర్ (ఈ అండ్ ఎం)సత్యనారాయణరావు శనివారం సందర్శించారు. ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మానించారు. వర్క్‌షాప్‌లోని కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ట్రస్టు ఆధ్వర్యంలో చీరలు పంపిణీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట, బుద్దిపల్లి గ్రామాల్లో శనివారం కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట రవి, జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, ఎంపీటీసీ బాపు, నాయకులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో కొక్కిరాల రఘుపతి రావు చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కొక్కిరాల సురేఖ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరీఫ్, చింత అశోక్ పాల్గొన్నారు.



'ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి'

చెన్నూర్: ఈ నెల 18 నుంచి నిర్వహించే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడారు. దీక్షల్లో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేశ్, నాయకులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల దీక్ష

లక్సెట్టిపేట: మండలంలోని అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట దీక్ష నిర్వహించి మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.